# తోకపిట్ట

సంపాదకులకు,

నమస్కారాలు.

నా పేరు గంగాధరశాస్త్రి. ఉత్తరాల రచయితగా మన ఆంధ్రదేశంలో ఉన్న ప్రతి పత్రికకూ పరిచయం ఉన్నవాడిని. మీ పత్రికలోనూ నా ఉత్తరాలు చాలా ప్రచురింపబడ్డాయి. నా పేరు మీకు గుర్తు ఉండే ఉంటుంది. ఉత్తమ ఉత్తరానికి బహుమతుల్లో నాలుగయిదు సార్లు బహుమతులు గెల్చుకున్నాను.

ఉత్తరాలు రాయడంలోని మజా కథలు రాయడంలో కాని, కవితలు రాయడంలో కాని ఉండవని నా మటుకు నాకు అనిపిస్తూ ఉంటుంది. ఇంగ్లీషులో కూడా ప్రయత్నించాను. కాని ఎంచాతనో రాణించలేకపోయాను. వివిధ తెలుగు పత్రికల్లో ఇప్పటివరకు రెండువేలకు పయిగా ఉత్తరాలు రాసి ఉంటాను.

మీకూ తెలుసు. ఏ ఉత్తరం అయినా పత్రికకు రాయడం అంత తేలికయిన పనేమీ కాదు. రొటీన్‌గా ఉంటే ఏం బావుండవు. రాసేది కొద్దిగయినా కష్టపడాలి. కథో, కవితో రాసిన రచయితో రచయిత్రికో కూడా తెలియని వాళ్ళ రచనల విషయాలు మరో కోణంలోంచి కూడా చూపించవచ్చు. మంచిగా ఉన్నా ఏం బావోలేదని కూడా తెగడవచ్చు. అడపా దడపా రచయితకూ రచయితకు పోల్చి చెబుతూ సిద్ధాంత పరంగా కాని లేకున్నాగాని ఒకరి జుట్టు ముడి ఒకరికి వేస్తూ తగాదాలను ఉసి కొల్పవచ్చు. సందెట్లో సడేమియాలా ఆ సమయంలో పత్రిక ఎక్కువగా అమ్ముడయ్యే అవకాశం లేకపోలేదు.

తమ రచనలు అచ్చు అయినప్పుడు వాటిని పొగుడుతూ నా చేత పత్రికలకు ఉత్తరాలు రాయించిన రచయితలు ఉన్నారు. వాళ్ళకు పారితోషికం, కనీసం అచ్చు అయిన ప్రతి పత్రికవాళ్ళు పంపించకపోయినా నాకు మటుకు మందుకొట్టించేవారు, కథలకూ, కవితలకు అసలు పారితోషికం ఇవ్వాలా అనే స్కూల్ ఆఫ్ థాట్‌లో మన

బి.పి.కరుణాకర్

తెలుగు పత్రికలు ముందున్నట్టున్నాయి. మీ గురించి అనడం లేదు. రచయితలు నాకు అరడజనో, డజనో కార్డులు ఇచ్చేవారు. ఇప్పుడు ఇన్‌లాండ్ కవర్లు ఎక్కువ మంది ఉపయోగించడం లేదు. కార్డుల మీద రకరకాల చేతి రాతలతో రాసేవాడిని. నాకు ఎడమచేతితో రాయడం కూడా వచ్చు. నేను రాసిన వాటిని పోస్టు చేస్తానో లేదో నని వాళ్ళే పోస్టు చేసేవాళ్ళు. ఒకసారి 'చాందా' (CHANDA) అని చిరునామాకు పిన్‌కోడ్‌తో సహా ఒక ఉత్తరం నా స్నేహితుడికి రాస్తే అది మామూలు కవరయినా 'కెనడా' (CANADA) వెళ్ళిపోయింది. వాళ్ళు దయతలచి TRY IN INDIA అని రాసి చాందా పంపించారనుకోండి.

వేరు వేరు పేర్లతో రాసినా అన్నీ అచ్చు అయ్యేవి కావు. కొందరయితే రచయితను తిడుతూ రాయమని అడిగి మందు కూడ ఎక్కువే పోయించేవారు. కాదనలేకపోయే వాడిని. రాయడం నాకు వ్యసనమయింది. ఎప్పుడూ ఎవరో ఒకరు ఏదో రాయమని కోరుతూ ఉంటారు. ఏ కారణం చేతయినా ఉత్తరాల శీర్షికల్లో నా పేరు కనిపించకపోయితే కొంతమంది మిత్రులునాకు ఫోనుచేసో, ఇమెయిలు ఇచ్చో "ఏమిటి, ఈ మధ్య కనిపించడం లేదు?" అని అడుగుతోంటే వెనకబడి పోతున్నట్టుగా ఉంటుంది.

ఎంచాతో దరిమిలా కథలు రాయడం మొదలెట్టాను. నా ఉత్తరాలు ఎక్కువగా మీ పత్రికల్లోనే ప్రచురింపబడ్డాయి కాబట్టి మీకే అక్షరాలా నలభయి కథలు వరకు పంపించాను. కొరియర్‌లో పంపించాను. అందే ఉంటాయి, ఉత్తరాల కయితే సొంత చిరునామా, స్టాంపులు అతికించిన కవర్లు పెట్టవలసిన అవసరం లేదు. కథలకు అలాకాదు కదా, పయిపెచ్చు నాదగ్గర చిత్తు ప్రతి కూడా లేదు. రాసినవి పంపించాను. తిప్పి పంపడానికి రిజిస్టర్డ్ పోస్టు స్టాంపుల పయికం తడిచి మోపుడయింది. కథలు పంపి రెండు సంవత్సరాలు కావస్తోంది. మీకు మీ రచయితలుంటారు. వాళ్ళను ఒక పక్కగా పెట్టడం బావుండదు. మీరు పరిశీలించి ఏ సంగతీ చెప్పే లోపల మరో రెండు సంవత్సరాలు తేలికగా పట్టొచ్చని నా అనుమానం.

ఇప్పుడు నేను ఒక నిశ్చయానికి వచ్చాను. నా కథల గురించి అడిగి మీకు ఇబ్బంది కలిగించడం నాకు ఇష్టం అనిపించడం లేదు. నా కథలు పోతే పోనీయండి.

వాటి గురించి బాధపడను. కథలను సార్ట్ చేసిన మీ అటెండరు చదివి టిక్ పెడితేనే గాని మీ  బల్ల మీదకు రావని విన్నాను. మీరు నాకో సహాయం చేయండి.  నా కథలు మీ దగ్గరే ఉంచేసుకుని నా స్టాంపులు మటుకు తిప్పి పంపించగలిగితే మీకెంతో ఋణపడి నా మిగిలిన కాలమంతా ఉత్తరాలు రాసుకుంటూ ఉండిపోతానని, కథలు రాసి  అటు పాఠకులకుగాని మీకు గాని ఎటువంటి ఇబ్బంది కలిగించనని రాసిన హామీ జత చేస్తున్నాను.

భవదీయుడు

జె.గంగాధరశాస్త్రి

(ఆ తర్వాత గంగాధరశాస్త్రి మా సంస్థలోని విజిలెన్స్ డిపార్టుమెంటులో అయిదేళ్ళపాటు పనిచేసి ఉన్నవీ లేనివాటి గురించి చాలామంది మీద ఆకాశరామన్న ఉత్తరాలు రాసి రెండు చేతులా సంపాయించాడు.)

* ఆదివారం వార్త, 25 అక్టోబరు 2009